క్లుప్తంగా

బీజేపీ నేత దిష్టిబొమ్మ దహనం



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లో దళితుడిపై మూత్రం పోసి అవమానించిన బీజేపీ నేత రాజీవ్ శుక్లా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ఆనంపల్లి ఎల్లం మాట్లాడారు. దళితులను అవమానిస్తే ఇకపై సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ శుక్లాను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దళిత సంఘాల నాయకులు బాలరాజు, రేకం దాసు, పెక్క స్వామి, తలారీ నవీన్ కుమార్, ఈశ్వర్, రాజు, భరత్, సాయిలు, గంగాధర్ ఉన్నారు.

నూతన లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



రెంజల్(బోధన్): మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా పెన్షన్ మంజూరైన లబ్ధిదారులకు శుక్రవారం ఆయా గ్రామాల సర్పంచ్‌ల చేతుల మీదుగా పింఛన్లు అందించారు. రెంజల్ మండల కేంద్రంలో 16 మందికి మంజూరైనట్లు సర్పంచ్ మర్ల రమేశ్ వివరించారు.

ముప్కాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం



బాల్కొండ: కాంగ్రెస్ పార్టీ ముప్కాల్ మండల అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన రెంజర్ల గ్రామానికి చెందిన మగ్గిడి ముత్యంరెడ్డిని శుక్రవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కిసాన్‌ఖేత్ ప్రధాన కార్యదర్శి చిన్నారెడ్డి, నాయకులు రిక్కల రవి, చాకీర్యాల్ చిన్నారెడ్డి, ఆకుల రమేశ్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన



బోధన్: సాలూర మండలంలోని జాడీజమాల్‌పూర్‌లో శుక్రవారం బోధన్ రూరల్ శాఖ కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా నేరాల నియంత్రణపై అవగాహన సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ నేరాల నియంత్రణ అంశాలను అధికారులు వివరించారు. ఏఎస్సై రవీందర్, కానిస్టేబుల్స్ నరేందర్, హరి చరణ్, భూదేవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించే వరకు దీక్షలు చేపడతాం



రెంజల్(బోధన్): రెంజల్ నుంచి ఎడపల్లి మండలం బ్రహ్మణపల్లి వరకు గల బందల్ల రోడ్డు పనులను ప్రారంభించే వరకు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని రైతులు పేర్కొన్నారు. రోడ్డు పనులను ప్రారంభించి వానాకాలంలో ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెంజల్ గ్రామ రైతులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 10వ రోజుకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు కులాల వారీగా దీక్షలను చేపట్టేందుకు ముందుకు వస్తున్నారు. వర్షం కురుస్తున్నా పట్టు వదలని విక్రమార్కునిలా రైతులు శిబిరంలో కూర్చున్నారు.

విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలి

బాల్కొండ: వరంగల్‌లో శనివారం నిర్వహించే విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డమాంకర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ముప్కాల్ మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. సంకల్ప యాత్రకు ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్నారన్నారు. మండల అధ్యక్షుడు గిరి, నాయకులు ముస్కు నర్సయ్య, చిల్క దినేష్, గడ్డం సంతోష్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సైదాబాద్ కాలనీ షాదీఖానాలో శుక్రవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, సీనియర్ నాయకుడు కోల వెంకటేష్ ఆధ్వర్యంలో పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగ యువకులను పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబాగౌడ్‌ను సన్మానించారు. నేతలు బాబాఖాన్, మీర్ మాజీద్, రవికాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- డొంకేశ్వర్ మండలంలోని పలు గ్రామాల్లో వంగిన స్తంభాలు
- వేలాడుతున్న కరెంట్ తీగలు
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ నిర్వహణ సక్రమంగా లేదు. ప్రధానంగా వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభాలు వంగిపోయి కరెంట్ తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతున్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పంటలు సాగు చేసే రైతులు ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని భయంతో పని చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అన్నారం గ్రామంలో పంట పొలాల మీదుగా వెళ్తున్న 11కేవీ హైటెన్షన్ లైన్ విద్యుత్ స్తంభాలు కొన్ని వంగిపోయి ప్రమాదాన్ని తలపిస్తున్నాయి. కురుస్తున్న వర్షాలకు పూర్తిగా వంగిపోతే మిగతా స్తంభాలపై కూడా ప్రభావం పడనుంది. విద్యుత్ వైర్లు తెగి కిందపడితే అనుకోని ప్రమాదం జరిగే ఆస్కారం కూడా ఉంది. వంగిన హెచ్‌టీ లైన్‌ను విద్యుత్ శాఖ అధికారులు సరి చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు. అదే విధంగా మారంపల్లి గ్రామంలో నూత్‌పల్లికి వెళ్లే బైపాస్ రోడ్డు మార్గం పక్కన పొలాల్లో లోటెన్షన్(ఎల్‌టీ) లైన్ వైర్లు కిందికి వేలాడుతున్నాయి. పొలంలో నిలబడి చేతిని పైకెత్తితే అందేలా ఉన్నాయి. ట్రాక్టర్‌తో దున్నితే వైర్లు ఎక్కడ తగిలి కరెంట్ షాక్ వస్తుందోనని ఆ స్థలంలో రైతులు పొలాన్ని దున్నలేదు. స్తంభానికి, స్తంభానికి మధ్య ఎక్కువ దూరం ఉండడంతో విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో వెళ్తున్నాయి. అదనపు స్తంభాలు ఏర్పాటు చేసి తీగలను సరి చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.



అన్నారం వద్ద వంగిన విద్యుత్ స్తంభాలు



మారంపల్లిలో తక్కువ ఎత్తులో ఉన్న తీగలు

వెంటనే సరి చేయాలి



పంట పొలాల మీదుగా వెళ్తున్న హైటెన్షన్, లోటెన్షన్ వైర్లు ప్రమాదకరంగా ఉన్న చోట వెంటనే సరి చేయాలని, వంగిన స్తంభాలను తొలగించి కొత్తవి లేదా, వాటినే సరి చేయాలని కోరారు. పంటలు సాగు చేసే రైతులకు కిందికి వేలాడుతున్న వెళ్తున్న కరెంట్ తీగలు ప్రాణగండంగా మారాయి.

– గంగారాం, రైతు, డొంకేశ్వర్

పరిశీలించి సరి చేస్తాం

డొంకేశ్వర్ మండలంలో ప్రతీ గ్రామానికి సెక్షన్ అధికారి ఉన్నారు. వారు గ్రామంలోని విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలను పరిశీలించి సరి చేస్తున్నారు. పంట పొలాల్లో వంగిన, తక్కువ ఎత్తులో వెళ్తున్న తీగలను సరి చేయడానికి చర్యలు తీసుకుంటాం.

– గయాస్ హైమద్, ఏఈ, ట్రాన్స్‌కో

అన్నదాత కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది



గుత్ప నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డి



ఆర్‌టీసీ బస్సులో ప్రయాణం చేస్తూ..

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

నందిపేట్(ఆర్మూర్): తెలంగాణలో పంటలు పచ్చబారి అన్నదాతలో కంట్లో ఆనందం వెల్లివిరిస్తుందని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఉమ్మెడ శివారులోని గుత్ప మొదటి పంపుహౌజ్ నుంచి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో గుత్ప ప్రాజెక్టు నీటి కోసం చేసి ఆందోళనలను గుర్తు చేశారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాత మనం ఎప్పుడు కావాలంటే అప్పుడు నీటిని విడుదల చేసుకుంటున్నామన్నారు. గోదావరి నదిపై ఉమ్మెడ–పంచగూడ వంతెన మంజూరు చేశారని, దీంతో నిజామాబాద్, నిర్మల్ జిల్లాలకు దూరం తగ్గి మరింత చేరువైందన్నారు. ఎంపీపీ సంతోష్‌రెడ్డి, జెడ్పీటీసీ యమున, సర్పంచులు ప్రభాకర్, రామడ పోశెట్టి పాల్గొన్నారు.

ఆర్‌టీసీ బస్సులో ఎమ్మెల్యే ప్రయాణం

నందిపేట్(ఆర్మూర్): ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి శుక్రవారం ఆర్‌టీసీ బస్సులో ప్రయాణం చేశారు. నందిపేట మండలంలోని ఉమ్మెడ శివారులో గుత్ప నీటిని విడుదల చేసిన అనంతరం అక్కడి నుంచి నందిపేట వరకు ఆర్‌టీసీ బస్సులో తిరుగు ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో మాట్లాడుతూ రెండు జిల్లాలను కలుపుతూ ప్రయాణికుల కోసం పంచగూడ, భైంసా బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

బీఆర్‌ఎస్‌కు విజయనగర్ గ్రామస్తుల మద్దతు

నందిపేట పరిధిలోని విజయనగర్ గ్రామప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి మద్దతు ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే స్వాగతం పలికారు. కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీకి తమ పూర్తి మద్దతు తెలుపుతున్నామని గ్రామస్తులు తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంపులో ఉచిత వైద్యశిబిరం

ఆర్మూర్: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా మనోరమ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి ఆర్మూర్ ప్రజలకు ఇలాంటి మరిన్ని వైద్య శిబిరాలను నిర్వహించాలని కోరారు.

పెంచిన వేతనాలు చెల్లించాలి



ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎండీఎం కార్మికులు



వర్నిలో సమ్మె నోటీసు అందజేస్తూ..



బోధన్ ఆర్డీవో ఆఫీస్‌లో వినతి పత్రం అందిస్తూ..

ఆర్మూర్‌టౌన్: మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలు, పెండింగ్‌లో ఉన్న బిల్లును వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు ఓమయ్య డిమాండ్ చేశారు. ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎండీఎం కార్మికులు ధర్నా నిర్వహించి, ఆర్డీవో కార్యాలయం సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంట కార్మికుల బిల్లును ప్రతి నెలా 5లోపు చెల్లించాలన్నారు. ప్రభుత్వమే వంట సామగ్రి, నిత్యావసరాలు సరఫర చేయాలన్నారు. ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మూడు రోజులు మధ్యాహ్న భోజనం బంద్

వర్ని: మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం పెంచిన రూ.3 వేల వేతనం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో 10, 11, 12 తేదీలలో మధ్యాహ్న భోజనం బంద్ చేసి టోకెన్ సమ్మె చేపడుతున్నామని కార్మికులు శుక్రవారం ఎంఈవో కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. కార్మికులకు కాటన్ దుస్తులు ఇవ్వాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నే సాబ్ తెలిపారు.

బోధన్‌లో..

బోధన్: మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 10 నుంచి నిరవధిక సమ్మె తలపెట్టామని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బోధన్ ఆర్డీవో ఆఫీస్‌లో ఏవో ముంతాజుద్దీన్‌కు వినతి పత్రం అందించారు. నేతలు విఠల్ గౌడ్, ఉమ పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని 10వ వార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు గంగాధర్ గౌడ్ కోరారు. బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. 10వ వార్డు గుండా బెల్లాల్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారిందని, నడవడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, రోడ్డు నిర్మించడానికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేయాలని, వార్డులో పద్మశాలి, ముదిరాజ్, రెడ్డికాపు, ఎస్సీ, మైనార్టీలకు చెందిన కమ్యూనిటీ భవనాలను మంజూరు చేయాలని కోరారు.

మురికి కాలువ సమస్య పరిష్కరించాలి



ఆర్మూర్‌టౌన్: స్థానిక కేజీబీవీలో నెలకొన్న మురికి కాలువ సమస్య పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సమస్యపై మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుస్తున్న వర్షాలకు కేజీబీవీ పాఠశాల మైదానం పూర్తిగా నీరుతో నిండిపోయిన చెరువును తలపిస్తుందన్నారు. దీంతో పాములు, ఇతర కీటకాలు రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాయకులు అనిల్, నిఖిల్, మహేష్, సాయి, కృష్ణ, సిద్ధు, రాజేష్ పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వ పథకాలపై ప్రచారం



బోధన్: మేరా బూత్ సబ్ సే మజ్బూత్, సంపర్క్ సమర్థన్ కార్యక్రమంలో భాగంగా బోధన్ మండలంలోని చిన్న మావంది, పెద్ద మావంది, పెగడపల్లి, భూలక్ష్మీ క్యాంప్ గ్రామాల్లో పార్టీ నాయకులు ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం చేపట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్ రెడ్డి గ్రామస్తులతో మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు పోశెట్టి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

గ్రామదేవతలకు గోదావరి జలాలతో అభిషేకం





రెంజల్(బోధన్): వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుకుంటూ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గోదావరి జలాలతో గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. మండలంలోని కల్యాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో శుక్రవారం డప్పు వాయిద్యాల మధ్య గోదావరి జలాలను తెచ్చి దేవతలకు అభిషేకం నిర్వహించారు. ఐదు వారాల పాటు ప్రతీ శుక్రవారం గ్రామ దేవతలకు గోదావరి జలాలతో అభిషేకం చేస్తామన్నారు. ప్రతినిధులు కిన్నెర మోహన్, బాలయ్య, కమ్మరి పోతన్న, తదితరులు పాల్గొన్నారు.

చందూర్‌లో..

రుద్రూర్: చందూరు మండల కేంద్రంలో వీడీసీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. కందకుర్తి నుంచి పవిత్ర జిల్లాలు తీసుకువచ్చి గ్రామంలోని ఆలయాల్లో జలాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ సాయిరెడ్డి, జెడ్పీటీసీ అంబర్ సింగ్, వైస్ ఎంపీపీ దశాగౌడ్ పాల్గొన్నారు.

మల్లారం దర్గాలో 50 సంవత్సరాల ఉర్సు



నందిపేట్(ఆర్మూర్): మల్లారం గ్రామంలోని దర్గా కమిటీ ఆధ్వర్యంలో 50 సంవత్సరాల ఉర్సును ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వచ్చిన బాబా భక్తులు ఉర్సులో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపుగా వచ్చి దర్గాలో చాదర్‌ను సమర్పించారు. దర్గా కమిటీ సభ్యులు డాక్టర్ షేక్ మహమూద్, ఈగ సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన చేస్తాం



రెంజల్‌లో సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు


- సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు

రెంజల్/నవీపేట: పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు పేర్కొన్నారు. రెంజల్, నవీపేట మండల కేంద్రాల్లో పారిశుధ్య కార్మికులు చేస్తు న్న సమ్మె రెండవ రోజుకు చేరింది. కార్మికులకు సంఘీభావం తెలిపి రమేశ్‌బాబు మాట్లాడారు.

రుద్రూర్: కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త సమ్మె రెండో రోజుకు చేరింది. రుద్రూర్ మండల కేంద్రంలో జీపీ కార్మికుల సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ సందర్శించారు. రాజు, కృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్మూర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు రెండు రోజులుగా చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న 50 వేల మంది ఉద్యోగ కార్మికుల వేతనాలను పెంచి పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భూముల సమస్య పరిష్కరించాలని వినతి



నాందేడ్ ఎంపీని కలిసిన నీలా గ్రామస్తులు

రెంజల్: నీలా రామాలయం భూముల సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు నాందేడ్ ఎంపీ ప్రతాప్‌రావ్ పాటిల్‌ను కలిశారు. నీలా గ్రామానికి చెందిన రామాలయం భూములు ధర్మాబాద్ సమీపంలోని బాలాపూర్ గ్రామంలో 75 ఎకరాలు ఉన్నాయని ఆయనకు వివరించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా కబ్జా చేసుకున్నాడని ఆయనకు స్థానికులు వివరించారు. నాందేడ్ కలెక్టర్ స్పందించి అక్కడి కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని మాటిచ్చారని వైస్ ఎంపీపీ యోగేశ్ వివరించారు. నాయకులు రాఘవేందర్, కిషన్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతాం



బోధన్‌లో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు



ఎడపల్లిలో..



- ఎంఎస్పీ జిల్లా కో–ఆర్డినేటర్ డల్లా సురేష్

బోధన్‌టౌన్/ఎడపల్లి/నవీపేట/రెంజల్: ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతామని ఎంఎస్పీ జిల్లా కో–ఆర్డినేటర్ డల్లా సురేష్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బోధన్ పట్టణం, ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కో–ఆర్డినేటర్ మాట్లాడారు. రిజర్వేషన్ సాధించే దిశగా రాబోవు నెల రోజుల్లో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ ఉందని, ఈ మహాసభకు మాదిగలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. దండోరా జెండాను ఆవిష్కరించారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ప్రమోద్ మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.. ఎమ్మార్పీఎస్ జెండా మాదిగల అస్తిత్వానికి ప్రతీక అన్నారు.

వేల్పూర్, బాల్కొండలలో..

వేల్పూర్/బాల్కొండ: వేల్పూర్ మండలం జాన్కంపేట్, బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎంఆర్‌పీఎస్ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. వినయ్, కాంతయ్య, భూమన్న, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఇన్‌సీడియోస్-(తెలుగు) – 10.45, 04.20, 9.45 పీఎం (తెలుగు)- 1.15 ఎస్‌పీవై (తెలుగు)-6.50
స్క్రీన్-2 –	సామజవరగమన – 10.00, 4.00, 7.00, 10.00, రుద్రంగి-1.00
స్క్రీన్-3 –	రంగబలి – 10.40, 1.35, 07.25, 10.20, ఓ సాథియా- 4.30
స్క్రీన్-4 –	ఎస్‌పీవై (తెలుగు)- 11.00, భాగ్ సాలే-1.55, 10.10 టీటీ(తెలుగు) – 4.35 సర్కిల్(తెలుగు)-7.20

సంక్షిప్తం

మామిడిపల్లిలో ఫ్రైడే డ్రై డే

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి యోగేశ్వర కాలనీలో శుక్రవారం స్థానిక ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సాయి మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండ ఇంటితో పాటు పరిసరాల్లో నీరు నిలువ కాకుండ చూసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్ వైజర్ రవీందర్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్‌లో శుక్రవారం మెట్‌పల్లి సంఘం నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో డాక్టర్ రామ్‌చందర్‌రెడ్డి 126 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ పద్మ, ఉప సర్పంచ్ రాజేశ్వర్, వీడీసీ అధ్యక్షుడు వసంత్ పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అన్నదానం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ వేడుక సందర్భంగా త్రినేత్ర ఫౌండేషన్ సహకారంతో అనాథ పిల్లల సమక్షంలో కేక్‌కట్ చేసి అన్నదానం కార్యక్రమం చేశారు. ఎంఎస్‌పీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మైలారం బాలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం కంటి ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి ఆపరేషన్ చేసుకుంటున్న వారికి లెన్స్‌కు అయ్యే ఖర్చు లయన్స్ అధ్యక్షుడు మోహన్‌దాస్ దంపతులు అందజేస్తున్నారు. జోన్ చైర్మన్ సామల లక్ష్మీ నారాయణ, రాంజన్న, రూపాలి నర్సయ్య, తదితరులున్నారు.

అదనపు తరగతి గదుల ప్రారంభం

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ ఉన్నత పాఠశాలలో నిర్మల్ బీవోటీ నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించిన అదనపు తరగతి గదులను మేనేజర్ ప్రణయ్ చందర్ ప్రారంభించారు. సర్పంచ్ గోపిడి సుజాత, ఉప సర్పంచ్ గంగారెడ్డి, ఎంపీటీసీ సాయన్న, హెచ్‌ఎం రవి ఉన్నారు.

కార్యదర్శుల కార్యవర్గం ఏర్పాటు

మాక్లూర్: మండల జూనియర్ పంచాయితీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కె.మోహన్, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీకాంత్, ఎ.హరీష్, జనరల్ సెక్రెటరీగా బి.రమేష్, తదితరులను ఎన్నికున్నారు.

ఆదివాసి నాయకపోడు నూతన కార్యవర్గం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల ఆదివాసి నాయకపోడు సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివాసి నాయకపోడు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్ ముఖ్య అతిథిగా హాజరై కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా పుట్ట కిరణ్, ప్రధాన కార్యదర్శిగా తొడు మహేష్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, తదితరులు ఎన్నికయ్యారు.

చెట్ల నరికివేతపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

రుద్రూర్: కోటగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో అనుమతి లేకుండా చెట్లను కొట్టివేశారని సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఈ విషయమై చర్యలు తీసుకోవాలని అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. మాజీ ఎంపీపీ గంగాధర్ దేశాయ్,ఎంపీటీసీ కొట్టం మనోహర్, తదితరులున్నారు.